సాక్షి
కుమురం భీం
బుధవారం ౹ 9 ౹ జూలై ౹ 2025



వాగు దాటితేనే వైద్యం

ఇంద్రవెల్లి మండలంలో ఓ చిన్నారిని తల్లిదండ్రులు అర్ధరాత్రి వాగుదాటి ఆస్పత్రికి తీసుకెళ్లారు. వాగుపై వంతెన నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. 8లో▸



నేడే సార్వత్రిక సమ్మె

దేశవ్యాప్తంగా బుధవారం సార్వత్రిక సమ్మె జరగనుంది. సింగరేణిలో సమ్మెను విజయవంతం చేసేందుకు కార్మికసంఘాలన్నీ ఏకమయ్యాయి. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.4 /24.2

ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాల ప్రభావంతో జిల్లా అంతటా మోస్తరు వాన కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నిబంధనలు పాటించకుంటే చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సీతారాం

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లాలోని ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి సీతారాం అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో కొందరు ఆర్‌ఎంపీలు, పీఎంపీలు రోగులకు తెలిసీతెలియని వైద్యం అందిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రథమ చికిత్స మాత్రమే అందించాలనే, ఇతర కేసులను ప్రభుత్వ ఆస్పత్రులకు రెఫర్‌ చేయాలని సూచించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఎలాంటి చికిత్స చేయొద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్‌ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మొక్కలతోనే మానవ మనుగడ



మొక్క నాటుతున్న డీఆర్‌డీవో దత్తారావు

కెరమెరి(ఆసిఫాబాద్‌): మొక్కలతోనే మానవ మనుగడని డీఆర్‌డీవో దత్తారావు అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని హట్టి ఆశ్రమ ఉన్నత పాఠశాల, ఎంపీడీవో కార్యాలయంలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ పుడమి తల్లి రక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. నాటిన మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకట్, ఎంపీడీవో అంజద్‌పాషా, ఎంఈవో ఆడే ప్రకాశ్, ఈజీఎస్‌ ఏపీవో మల్లయ్య, ఐకేపీ ఏపీఎం జగదీశ్వర్‌ పాల్గొన్నారు.

డ్రగ్స్‌ యూరిన్‌ టెస్ట్‌ కిట్లు పంపిణీ



కిట్లు అందిస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్‌

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఆసిఫాబాద్‌ డివిజన్‌ పోలీసు అధికారులకు వంద డ్రగ్స్‌ యూరిన్‌ టెస్ట్‌ కిట్లను మంగళవారం ఏఎస్పీ చిత్తరంజన్‌ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా డ్రగ్స్‌ వాడినట్లు అనుమానం ఉంటే కిట్లు ఉపయోగించి యూరిన్‌ పరీక్షల ద్వారా గుర్తించవచ్చని తెలిపారు. వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విధులను నిర్లక్ష్యం చేయొద్దు

బెజ్జూర్‌(సిర్పూర్‌): గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే ఉద్యోగులు విధులను నిర్లక్ష్యం చేయొద్దని ఏటీడీవో శ్రీనివాస్‌ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలో వసతులపై ఆరా తీశారు. పాఠశాలలో సమస్యలు ఉంటే ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రధానోపాధ్యాయుడు దినాకర్‌ను ప్రశ్నించారు. చిన్నపాటి సమస్యలను సైతం పరిష్కరించుకోకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడంపై మండిపడ్డారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు. అలసత్వం ప్రదర్శించే ఉపాధ్యాయులకు షోకాజు నోటీసులు జారీ చేస్తామన్నారు. నాలుగు రోజుల్లో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎస్‌ఆర్పీ వెంకటేశ్వర్, ప్రధానోపాధ్యాయులు భిక్షమయ్య, ప్రసాద్, ఉపాధ్యాయులు ఉన్నారు.

సమ్మెకు దూరంగా ఉండి సంస్థకు సహకరించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్‌): సింగరేణి ఉద్యోగులు సార్వత్రిక సమ్మెకు దూరంగా ఉండి సంస్థకు సహకరించాలని బెల్లంపల్లి ఏరియా జనరల్‌ మేనేజర్‌ విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పోటీ ప్రపంచంలో ఒక్కరోజు పని గంటలు నష్టపోవడం మూలంగా సింగరేణి సంస్థ ఉత్పత్తిపరంగా వెనుకంజ వేయాల్సి వస్తుందన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం పథకాలు అమలుచేస్తున్న సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. ఉద్యోగులు విధులకు హాజరై వార్షిక లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో ప్రాజెక్టు అధికారి నరేందర్, ఇంజినీరు వీరన్న, మేనేజర్‌ శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు



రావూరి శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

- జిల్లాలో 6,400 మెట్రిక్‌ టన్నులు అందుబాటులో ఉంది
- రైతులెవరూ ఆందోళన చెందొద్దు
- నెలాఖరు వరకు సరిపడా నిల్వలు
- మోతాదుకు మించి వినియోగించొద్దని సూచన
- 'సాక్షి' ఇంటర్వ్యూలో డీఏవో రావూరి శ్రీనివాసరావు వెల్లడి

సాక్షి, ఆసిఫాబాద్‌: 'వానాకాలంలో జిల్లాలోని రైతులు ప్రధానంగా పత్తి, సోయా, కంది, వరి పంటలు సాగు చేస్తున్నారు. యాసంగిలో మొక్కజొన్న, జొన్న పంటలు పండిస్తున్నారు. పంటల్లో అధిక దిగుబడి సాధించాలని, మొక్కలు ఏపుగా పెరగాలనే ఉద్దేశంలో రైతులు యూరియాను విచక్షణారహితంగా వినియోగించడంతో నేల పాడవడమే కాక.. పర్యావరణానికి హాని కలుగుతోంది. ఇది ధరిత్రికి, రైతులకు మంచిది కాదు. ప్రస్తుతం జిల్లాలో యూరియా కొరత లేదు. అధికంగా యూరియా వాడితేనే పంట ఏపుగా పెరుగుతుందనే అపోహతో ఎక్కువ మొత్తంలో వినియోగిస్తున్నారు. అయినా ఈ నెలాఖరు వరకు సరిపడా నిల్వలు ఉన్నాయి.' అని జిల్లా వ్యవసాయశాఖ అధికారి(డీఏవో) రావూరి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన 'సాక్షి' ఇంటర్వ్యూలో పలు వివరాలు వెల్లడించారు.

సాక్షి: జిల్లా రైతులు వానాకాలంలో ఏ పంటలను ఎక్కువగా సాగు చేస్తున్నారు? పంటల సాగు అంచనా ఎంత?

డీఏవో: జిల్లాలో అన్ని పంటలు కలుపుకుని 4.45 లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేస్తారని అంచనా వేశాం. ఇందులో ప్రధానంగా పత్తి 3.35 లక్షల ఎకరాలు, వరి 55 వేలు, కంది 32 వేలు, పెసర, సోయా, ఇతర హార్టికల్చర్‌ పంటలు మరో 23వేల వరకు ఉంటాయి.

సాక్షి: యూరియా కొరతతో జిల్లా రైతులు బ్లాక్‌లో ఎరువులు కొనాల్సిన పరిస్థితులు ఉంటున్నాయి? నిజంగా జిల్లాలో కొరత ఉందా?

డీఏవో: జిల్లాలో పంట సాగుకు అనుగుణంగా 60 వేల మెట్రిక్‌ టన్నుల యూరియా, 45 వేల మెట్రిక్‌ టన్నుల కాంప్లెక్స్, 20 వేల మెట్రిక్‌ టన్నుల పొటాష్‌ అవసరమవుతుందనే అంచనాతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఇప్పటికే 25 వేల మెట్రిక్‌ టన్నుల యూరియా వచ్చింది. అలాగే కాంప్లెక్స్‌ 18 వేలు మె.టన్నులు, పొటాష్‌ 230 మెట్రిక్‌ టన్నులు దిగుమతి అయ్యింది.

సాక్షి: గతంలో మాదిరిగా కాకుండా ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం విడతల వారీగా ఎరువులు పంపుతోంది? ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది?

డీఏవో: కేంద్ర ప్రభుత్వం సేంద్రియ వ్యవసాయం, నేల ఆరోగ్యం కాపాడాలనే లక్ష్యంతో ఉంది. అందులో భాగంగా రసాయన ఎరువుల వాడకం తగ్గించాలనే యోచన చేస్తోంది. గతంలో ఒకేసారి ఎరువులు దిగుమతి అయ్యేవి. రైతులు యూరియాను మోతాదుకు మించి వినియోగించడం అలవాటు చేసుకున్నారు. దీనిని గమనించిన కేంద్రం.. ఇప్పుడు నెలవారీగా రైతులకు సరిపడా మాత్రమే ఎరువులను రాష్ట్రాలకు పంపిస్తోంది.

సాక్షి: ఇప్పటివరకు జిల్లాలో ఎంత యూరియా నిల్వ ఉంది? ఆగస్టు, సెప్టెంబర్‌ నెలలకు ఎంత అవసరం పడుతుంది?

డీఏవో: జిల్లాలో 6400 మెట్రిక్‌ టన్నుల యూరియా నిల్వ ఉంది. ఇది ఈ నెలాఖరు వరకు సరిపోతుంది. ఆగస్టుకు సంబంధించి 25 వేల మెట్రిక్‌ టన్నుల యూరియా అవసరం ఉంటుంది. దానికి సంబంధించి ఇండెంట్‌ను సర్కారుకు పంపించాం. సెప్టెంబర్‌కు సంబంధించిన ఎరువులు ఆగస్టు నెలాఖరున వస్తాయి.

సాక్షి: మోతాదుకు మించి యూరియా వాడితే జరిగే నష్టమేంటి?

డీఏవో: రైతులు విత్తనం వేసిన తర్వాత 3 నుంచి 4 రోజుల్లో డీఏపీ, కాంప్లెక్స్‌ ఎరువులు వినియోగించాలి. అంతేకానీ మొక్క వచ్చాక కూడా వాటిని వినియోగించరాదు. ఒక ఎకరానికి 90 కేజీల నుంచి 120 కేజీల వరకు వినియోగిస్తే సరిపోతుంది. కానీ జిల్లాలో ఎకరాకు రెండు, మూడు బస్తాలు వినియోగిస్తున్నారు. దీంతో నేల ఆరోగ్యం పాడవడమే కాకుండా చీడపీడల ఉధృతి పెరుగుతుంది. ఫలితంగా ఆశించిన దిగుబడులు రాకపోవచ్చు.

సాక్షి: నానో యూరియా ఎప్పుడు వినియోగించాలి? దాని వల్ల ఉపయోగాలేంటి?

డీఏవో: యూరియాకు బదులుగా రెండో దఫాలో నానో యూరియా స్ప్రేను రైతులు వినియోగించాలి. ఎకరాకు అర లీటరు చొప్పున వాడాలి. రెండు విడతలు వాడితే సరిపోతుంది. దీని వల్ల భూసారం దెబ్బతినదు.

సాక్షి: జిల్లాలోని చాలామంది రైతులు కాంప్లెక్స్, పొటాష్‌ వినియోగించడం లేదు? ఎందుకు?

డీఏవో: వాస్తవానికి యూరియాతోపాటు పంటలకు పొటాష్, భాస్వరం ఇతర కాంప్లెక్స్‌ ఎరువుల అవసరం ఉంటుంది. పొటాష్‌ తప్పనిసరిగా వాడాలి. దీనివల్ల మొక్క ధృడంగా పెరుగుతుంది. అయితే వీటి ధర ఎక్కువగా ఉండటంతో రైతులు పెద్దగా మొగ్గు చూపడం లేదు.

కలెక్టరేట్‌లో ప్రతీరోజు ప్రజావాణి

- గ్రీవెన్స్‌ సెల్‌ ప్రారంభించిన కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే



కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌ సెల్‌లో అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే

ఆసిఫాబాద్‌: జిల్లా కేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణితోపాటు ఇక నుంచి ప్రతీరోజు కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందని కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని జీ- 3లో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌ కంట్రోల్‌ రూమ్‌ను అదనపు కలెక్టర్లు దీపక్‌ తివారి, డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి మంగళవారం ప్రారంభించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ ప్రతిరోజూ గ్రీవెన్స్‌ సెల్‌లో సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చన్నారు. గ్రీవెన్స్‌సెల్‌లో ప్రత్యేక సిబ్బందిని నియమించామని తెలిపారు. రెండు దరఖాస్తులు రాగా, ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంబంధిత మండలాలకు పరిష్కారం కోసం పంపించారు. కలెక్టరేట్‌ ఏవో కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

'ఇందిర గిరి జలవికాసం' అమలుకు కమిటీలు

ఆసిఫాబాద్‌: జిల్లాలో ఇందిర గిరి జలవికాసం పథకం అమలు కోసం మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే ఆదేశించారు. కలెక్టరేట్‌ నుంచి మంగళవారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి, కాగజ్‌నగర్‌ ఎఫ్‌డీవో సుశాంత్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా ఎంపీడీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ ఇందిర సౌర గిరిజల వికాసం పథకం మొదటి విడతలో పోడు పట్టా భూములకు సాగునీరు అందించేందుకు బోర్లు, వ్యవసాయ బావులు మంజూరు చేసి, సౌర విద్యుత్‌ అందించనున్నట్లు వివరించారు. రెండున్నర ఎకరాలు కలిగిన రైతులకు బోరు సౌకర్యం, రెండున్నర ఎకరాల లోపు రైతులుంటే ఇద్దరికి కలిపి బోర్లు, బావి నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఐదు విడతలుగా కార్యక్రమం ఉంటుందని, అటవీశాఖ నుంచి అడ్డంకులు ఉండవని స్పష్టం చేశారు. అనంతరం సంక్షేమ, అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రమాదేవి, డీఆర్‌డీవో దత్తారావు, డీఏవో శ్రీనివాసరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నదీమ్, మిషన్‌ భగీరథ ఈఈ సిద్దిక్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ శేషారావు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణకు చర్యలు



సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే, ఎస్పీ కాంతిలాల్‌ పాటిల్, అధికారులు

ఆసిఫాబాద్‌: ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజల రక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ ద్వారా రూ.5 లక్షలతో సమకూర్చిన 4 సీట్లతో కూడిన బోటు, 50 లైఫ్‌ జాకెట్లు, 20 రబ్బర్‌ ట్యూబులు, ఒక కోత యంత్రాన్ని మంగళవారం ఎస్పీ కాంతిలాల్‌ పాటిల్, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఎమ్మెల్సీ దండె విఠల్, అదనపు కలెక్టర్లు దీపక్‌ తివారి, డేవిడ్‌తో కలిసి పోలీస్, అగ్నిమాపక శాఖలకు అందించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ భారీ వర్షాలు వచ్చినప్పుడు ప్రజల రక్షణ, ఆస్తులు నష్టపోకుండా సత్వరమే రెస్క్యూ చేసేందుకు ఈ పరికరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. పోలీస్, అగ్నిమాపక శాఖల్లో 15 మందితో కూడిన శిక్షణ సిబ్బంది ఉన్నారన్నారు. గతంలో విపత్తులు సంభవించినప్పుడు మంచిర్యాల నుంచి సిబ్బంది వచ్చేవారని, ఇప్పుడు జిల్లాలోనే అందుబాటులో ఉన్నాయన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌ డివిజన్ల వారీగా బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వైఎస్సార్‌ ఆశయాలు నెరవేరుస్తాం



వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్‌ పార్టీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం కృషి చేసిన దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖరరెడ్డి ఆశయాలను నెరవేరుస్తామని కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్‌ అన్నారు. వైఎస్సార్‌ జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్యాంనాయక్‌ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకంతో పాటు వైద్య రంగంలో విప్లవాత్మక నిర్ణయాలను వైఎస్సార్‌ అమలు చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఆయన కలలను నిజం చేయడం కాంగ్రెస్‌ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. రాజశేఖరరెడ్డి అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాపర్తి మురళి, నిజాం, లచ్చన్న, వినోద్, విశ్వనాథ్, బాలేష్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



సమస్యలు తెలుసుకుంటున్న పీవో ఖుష్బూ గుప్తా

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లాలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనం, ఇతర వసతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పీవో మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషకాహారం అందించాలన్నారు. సబ్జెక్టుల వారీగా అర్థమయ్యేలా బోధించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో దోమల వ్యాప్తిని అడ్డుకుని, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వసతిగృహాల పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. వంటగది, స్టోర్‌రూం, మరుగుదొడ్లు నిత్యం శుభ్రం చేయాలని సూచించారు. అనంతరం పదో తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు.

ఎరువుల కోసం రోడ్డెక్కిన రైతులు



జైనూర్‌లో ధర్నా చేస్తున్న రైతులు

జైనూర్‌(ఆసిఫాబాద్‌): సరిపడా ఎరువులు పంపిణీ చేయాలని జైనూర్‌ మండల కేంద్రంలో మంగళవారం రైతులు రోడ్కెక్కారు. ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ వానాకాలం సీజన్‌లో ఎరువులు చేసేందుకు సన్నద్ధమవుతున్న సమయంలో యూరియా కొరత ఏర్పడుతుందని తెలిపారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం హామీ మేరకు రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై రవికుమార్‌ ఘటనాస్థలికి చేరుకున్నారు. వ్యవసాయాధికారులతో మాట్లాడి ఎరువుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

చిన్నారుల మోములో చిరునవ్వులు

- కొనసాగుతున్న 'ఆపరేషన్‌ ముస్కాన్‌- 11'
- ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌ డివిజన్లలో రెండు బృందాలు ఏర్పాటు
- బాలకార్మికుల గుర్తింపు కోసం విస్తృతంగా తనిఖీలు
- గతేడాది 61 మంది చిన్నారులకు విముక్తి




రైస్‌ మిల్లులో తనిఖీ చేస్తున్న ప్రత్యేక బృందం(ఫైల్‌)

పెంచికల్‌పేట్‌(సిర్పూర్‌): పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన బాలలు రెక్కల కష్టం చేస్తున్నారు. పుస్తకాలు, ఆటలతో గడవాల్సిన బాల్యం పరిశ్రమలు, వ్యాపార సముదాయాల్లో బందీగా మారుతోంది. ఈ నేపథ్యంలో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించే దిశగా, బందీలుగా మారిన చిన్నారుల మోములో చిరునవ్వులు నింపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా చేపట్టిన ఆపరేషన్‌ ముస్కాన్‌ - 11 కార్యక్రమం జూలై 1 నుంచి 31 వరకు కొనసాగనుంది. నెల రోజులపాటు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌ డివిజన్ల పరిధిలో తనిఖీలు చేపట్టేందుకు రెండు బృందాలు ఏర్పాటు చేశారు. బాలకార్మికుల స్థావరాలుగా నిలిచే పరిశ్రమలు, వ్యాపార సముదాయాలు, గోదాములు, హోటళ్లు, మెకానిక్‌ షాపులు, ఇటుక బట్టీలు, ఇతర పారిశ్రామిక ప్రాంతాల్లో దాడులు నిర్వహించనున్నారు. గతేడాది ఆపరేషన్‌ ముస్కాన్‌- 10లో భాగంగా జిల్లావ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి 61 మంది చిన్నారులను గుర్తించారు. వీరిలో 48 బాలకార్మికులు మంది ఉండగా.. బాల్య వివాహం జరిగిన ఒకరు, బడిమానేసిన పిల్లలు 12 మంది ఉన్నారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌ నిర్వహించి పిల్లలను వారికి అప్పగించారు. అలాగే 2022 నుంచి ఇప్పటివరకు నిర్వహించిన ఆపరేషన్‌ ముస్కాన్‌ కార్యక్రమంలో మొత్తం 143 మందికి విముక్తి కల్పించారు.

విస్తృతంగా తనిఖీలు

జిల్లాలో 335 గ్రామ పంచాయితీలు ఉండగా, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌ మున్సిపాలిటీలు ఉన్నాయి. కాగజ్‌నగర్‌ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందింది. పోలీసు అధికారులు, శిశుసంరక్షణ, కార్మిక, బాలల హక్కుల పరిరక్షణ సమితి, విద్యాశాఖ సమన్వయంతో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌ డివిజన్లలో బందీలుగా ఉన్న బాలలను గుర్తించడానికి రెండు బృందాలు ఏర్పాటు చేశారు. కాగజ్‌నగర్‌ డివిజన్‌ బృందంలో ఎస్సై యాదగిరి, ఆసిఫాబాద్‌ డివిజన్‌ బృందంలో ఎస్సై చంద్రశేఖర్‌రావుతో పాటు చైల్డ్‌ ప్రొటెక్షన్‌ అధికారి, ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక మహిళా కానిస్టేబుల్, కార్మిక శాఖ నుంచి ఒకరిని సభ్యులుగా నియమించారు. వీరు తప్పిపోయిన పిల్లలు, అనాథలు, వీధి బాలలను గుర్తిస్తారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, హోటళ్లు, దాబాలు, మిల్లులు, ఇటుక బట్టీల్లో పనిచేసున్న పిల్లలకు విముక్తి కల్పిస్తారు. చిన్నారుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌ నిర్వహిస్తారు. అనాథ బాలికలను జిల్లా కేంద్రంలోని వసతి గృహాలకు తరలించి ఉచితంగా విద్య, వైద్యం, భోజన వసతి కల్పించనున్నారు. మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, హైదరాబాద్‌ వంటి పట్టణాలకు జిల్లా నుంచి వెళ్లి అనేకమంది రైసు మిల్లులు, ఇటుక బట్టీలు, ఇతర పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. అధికారులు వీరిపైనా దృష్టి సారించి పనుల్లో ఉన్న చేరిన చిన్నారులను గుర్తించాల్సి ఉంది. మరోవైపు జిల్లాలో ఇటీవల మానవ అక్రమ రవాణా ముఠాను పోలీసులు పట్టుకున్నారు. బాలికలు, యువతులను ఇతర రాష్ట్రాలకు విక్రయిస్తున్న ఘటనలు వెలుగుచూశాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో బాలికల సంరక్షణపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే కేసులు



బాలలకు రాజ్యాంగం ప్రత్యేక హక్కులు కల్పించింది. వారి హక్కులను కాలరాస్తూ పనిలో పెట్టుకుంటే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తాం. బడీడు పిల్లలందరినీ తల్లిదండ్రులు తప్పకుండా పాఠశాలకు పంపించాలి. బాల్యవివాహాలను ప్రోత్సహించిన వారిపై కేసు నమోదు చేస్తాం. బాలకార్మికులను గుర్తిస్తే వెంటనే డయల్‌ 100 లేదా 1098 నంబర్లకు సమాచారం అందించాలి.

– బి.మహేశ్, జిల్లా బాలల సంరక్షణ అధికారి

ప్రాణం తీసిన వన్యప్రాణుల వేట

- విద్యుత్‌ తీగలు తగిలి ఒకరు మృతి
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన
- ఐదుగురిపై కేసు

వాంకిడి(ఆసిఫాబాద్‌): వన్యప్రాణుల వేట ఓ వ్యక్తి ప్రాణం తీసింది. అడవి జంతువులను వేటాడేందుకు యత్నించిన వేటగాళ్లలో ఒకరు విద్యుత్‌షాక్‌తో మృతి చెందారు. ఆలస్యంగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఎస్సై ప్రశాంత్‌ తెలిపిన వివరాల ప్రకారం.. వాంకిడి మండలం నవేధరి గ్రామానికి చెందిన ఆత్రం తిరుపతి(38) ఏడాది క్రితం నుంచి అప్పుడప్పుడు మతిస్థిమితం లేకుండా తిరుగుతుండేవాడు. పలుమార్లు ఇంట్లో నుంచి వెళ్లిపోగా, కుటుంబ సభ్యులు వెతికి తీసుకొచ్చేవారు. మిగతా రోజుల్లో సాధారణంగానే మెలిగేవాడు. జనవరి 29న అదే గ్రామానికి చెందిన పూసం కేశవ్‌రావు, మండోరె బుర్యా(అలియాస్‌ మహేశ్‌) అనే ఇద్దరు తిరుపతి ఇంటికి వెళ్లి ఈ రోజు రాత్రి అడవి జంతువుల వేటకు వెళ్దామని చెప్పి అతడిని సిద్ధం చేశారు. విద్యుత్‌ తీగలు ముందుగానే సిద్ధం చేసి అదే గ్రామానికి చెందిన మడావి భీంరావు, రాంపూర్‌ గ్రామానికి చెందిన అర్క రమేశ్, పెద్ద పుల్లార గ్రామానికి చెందిన మడావి భీంరావు.. మొత్తం ఆరుగురు గ్రామ శివారులోని అటవీ ప్రాంతానికి వెళ్లారు. మరుసటి రోజు తెల్లారేవరకు వేటకు వెళ్లిన వారెవ్వరూ ఇళ్లకు చేరుకోలేదు. 30వ తేదీన కేశవ్‌రావు, బుర్యా(మహేశ్), మడావి భీంరావు గ్రామానికి రాగా, తిరుపతి కుటుంబ సభ్యులు వారిని విచారించారు. విద్యుత్‌ తీగలు అమర్చి ఓ చెట్టు కింద కూర్చుని ఉండగా.. అటువైపుగా వెళ్తున్న ఫారెస్టు అధికారి వెళ్లిపోవాలని చెప్పడంతో ఇంటికి వచ్చామని తెలిపారు. కుటుంబ సభ్యులు అటవీప్రాంతంలో వెతకగా 31వ తేదీన పెవుట గుట్టపై తిరుపతి మృతదేహం లభ్యమైంది. సహజ మరణంగా భావించి వారు సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ఇదిలా ఉండగా.. ఈ నెల 3న తిరుపతి మేనల్లుడు చిక్రం ప్రకాశ్‌ వాంకిడిలో వారసంతకు వెళ్లినప్పుడు అసలు విషయం వెలుగులోకి వచ్చింది. తిరుపతిది సహజ మరణం కాదని, విద్యుత్‌ తీగలకు తగిలి మృతి చెందాడని ప్రకాశ్‌తో నవేధరి గ్రామానికి చెందిన దుర్వ జంగు చెప్పాడు. ఈ విషయం అతడు కుటుంబ సభ్యులకు తెలిపాడు. వారంతా పూసం కేశవ్‌రావును ప్రశ్నించేందుకు ప్రయత్నించగా.. తప్పించుకుంటూ తిరుగుతున్నాడు. మంగళవారం మృతుడి భార్య ఆత్రం సంగీత కేశవ్‌రావును నిలదీయగా.. వేటకు అమర్చిన కరెంటు తీగలకు తగిలి మృతి చెందినట్లు ఒప్పుకున్నాడు. సంగీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఐదుగురు నిందితులను రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

దేశీదారు విక్రేత బైండోవర్

ఇచ్చోడ: దేశీదారు విక్రయిస్తున్న సొనాల మండలంలోని గుట్ట పక్క తాండకు చెందిన మట్ట చందర్‌సింగ్‌ను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి రూ.50 వేల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపారు. మంగళవారం ఇచ్చోడ సీఐ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. సదరు వ్యక్తి దేశీదారు విక్రయిస్తుండగా పలుమార్లు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అయినా మానలేదన్నారు. జరిమానా డబ్బులను చలానా రూపంలో ప్రభుత్వ ఖజానాలో జమ చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ముగ్గురిపై పిచ్చికుక్క దాడి

దహెగాం: మండల కేంద్రంలో పిచ్చికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రాత్రి పగలు తేడా లేకుండా దాడులు చేస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న కొత్తపల్లికి చెందిన తొడిషం శంకరి, నార వెంకటేశం, లక్ష్మిపై దాడి చేసి గాయపర్చడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి పిచ్చికుక్కల బారినుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ఒకరిపై కేసు నమోదు

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని ఓ వెల్డింగ్ షాపులో బాలుడిని పనిలో పెట్టుకున్న యజమానిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇ.సాయన్న తెలిపారు. ఉట్నూర్ సహాయ కార్మిక శాఖ జూనియర్ అసిస్టెంట్ సెడ్మకి దేవుబాయి ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా విధులు నిర్వహిస్తుండగా వెల్డింగ్ షాప్‌లో బాలుడు పనిచేస్తూ కనిపించడంతో వివరాలు సేకరించారు. బాలునికి 16 సంవత్సరాలు ఉన్నట్లు నిర్ధారణ కావడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో షాప్ నిర్వాహకుడు షెక్ రేహన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

మోసగించిన ప్రభుత్వ ఉద్యోగిపై కేసులు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగి కొండూరి గంగాధర్‌పై మరో రెండు కేసులు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఇంటి స్థలాలు ఇస్తానని మోసం చేసిన కేసులో సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ కాలనీకి చెందిన దాసరి అనసూయ నుంచి 1996లో కొండూరి గంగాధర్ రూ.5వేలు తీసుకొని సర్వే నం.346లో ప్లాట్ నం.304-ఏ రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చాడు. ఇటీవల అది నకిలీ పట్టా అని తేలడంతో అతనిపై ఫిర్యాదు చేశారు. మంచిర్యాల జిల్లా జన్నారంకు చెందిన అనుముల శ్రీనివాస్‌కు సర్వే నం.346లో 304 నకిలీ పట్టా చేసి ఇచ్చాడు. ఒకే ప్లాట్‌ను నకిలీ పట్టాలతో ఇద్దరి పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడంతో కొంత కాలంగా అనుసూయ, శ్రీనివాస్ మధ్య గొడవ జరుగుతోంది. వీరిద్దరి సమస్యను పరిష్కరించేందుకు శ్రీనివాస్ వద్ద నుంచి గంగాధర్ రూ.లక్ష డిమాండ్ చేశాడని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

అతిగా మద్యం సేవించి ఒకరు మృతి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని చున్నంబట్టి వాడకు చెందిన అసం కిషన్ (36) అతిగా మద్యం సేవించి మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈనెల 7న రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చి బాత్రూం సమీపంలోని మెట్లపైన పడుకున్నా డు. ఉదయం కిషన్ తల్లి లక్ష్మి వచ్చి ఎంత పిలిచినా పలుకకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించా రు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందిన ట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మే రకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నేడే సార్వత్రిక సమ్మె

- సింగరేణిలో ఏకమైన కార్మిక సంఘాలు
- విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపు
- లేబర్ కోడ్‌లతోపాటు సింగరేణి పరిధిలో డిమాండ్లు



సమ్మెకు సిద్ధమంటూ నినాదాలు చేస్తున్న ఎస్సార్పీ 1 గని కార్మికులు

శ్రీరాంపూర్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా నేడు దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె జరగనుంది. ఈ సమ్మెను సింగరేణిలో విజయవంతం చేసేందుకు కార్మికసంఘాలన్నీ ఏకమయ్యాయి. కొద్ది రోజులుగా సమ్మె విజయవంతం కోసం కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పడి గనులపై విస్తృత ప్రచారం నిర్వహించాయి. బీఎంఎస్ మినహా అన్ని సంఘాలు సమ్మెకు 'సై' అనడంతో సింగరేణిలో సమ్మె అనివార్యమైంది. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టీయూసీతో పాటు సీఐటీయూ, టీబీజీకేఎస్ కలిసి సింగరేణి కార్మిక సంఘాల జేఏసీగా ఏర్పడ్డాయి. హెచ్‌ఎంఎస్, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం, ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ, టీఏన్టీయూసీ సంఘాలు సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక పేరుతో మరో జేఏసీగా ఏర్పడి సమ్మెలో క్రియాశీల పాత్ర పోషిస్తున్నాయి. ఇదిలా ఉంటే మే 20వ తేదీనే ఈ సమ్మెకు పిలుపునిచ్చిన సంఘాలు ఇండియా, పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావర ణం నేపథ్యంలో జూలై 9వ తేదీకి వాయిదా వేశారు.

సింగరేణిలో డిమాండ్లు

దేశ వ్యాప్తంగా బ్యాంకులు, బొగ్గు సంస్థలతో పాటు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు రంగాలతో పాటు అసంఘటిత రంగాల్లో కూడా ఈ సమ్మెకు పిలుపునిచ్చారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను వ్యతిరేకిస్తూ ఈ సమ్మె డిమాండ్ ఉంది. కానీ సింగరేణిలో ఈ లేబర్‌కోడ్‌లతో పాటు ఇతర డిమాండ్లను కూడా చేర్చి జేఏసీ నేతలు కొద్దిరోజుల క్రితం యాజమాన్యానికి సమ్మె నోటీసు అందించారు.

- కార్మికులకు పెర్క్స్‌పై ఆదాయపు పన్ను కంపెనీ చెల్లించాలి.
- కార్మికులకు సొంతింటి పథకం అమలు చేసి ఇంటి స్థలంతో పాటు రూ.25 లక్షల వడ్డీలేని రుణం ఇవ్వాలి.
- తెలంగాణ ప్రాంతంలోని బొగ్గు బ్లాకులను వేలంతో సంబంధం లేకుండా సింగరేణికి కేటాయించాలి
- కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి.

సమ్మెకు బీఎంఎస్ దూరం

ఈ సమ్మెకు జాతీయ సంఘమైన బీఎంఎస్ దూరంగా ఉంది. మే 20న సమ్మెకు పిలుపునిచ్చినప్పుడు దేశంలో యుద్ధవాతావరణం నెలకొంది. ఇలాంటి సమయంలో సమ్మె చేయడం సరికాదని, అందుకే సమ్మెకు దూరంగా ఉంటున్నామని తెలిపింది. సమ్మె వాయిదా పడటంతో నేడు ఈ సమ్మె రాజకీయ ప్రేరేపిత సమ్మె అని, తాము సమ్మెకు దూరంగా ఉంటున్నామని, కార్మికులు పాల్గొనవద్దని ఆ సంఘం నాయకులు ప్రకటన చేశారు.

వద్దంటున్న యాజమాన్యం..

ఈ సమ్మెకు కార్మికులు దూరంగా ఉండాలని సింగరేణి యాజమాన్యం కోరింది. ఈ మేరకు అన్ని ఏరియాల జీఎంలు, కార్మికులు రోజువారిలాగానే నేడు విధులకు హాజరుకావాలని కోరింది. సమ్మె డిమాండ్లు తమ పరిధిలో లేవని, జాతీయ స్థాయి సమస్యలపై సింగరేణిలో సమ్మె చేస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదని, కార్మికులు సమ్మెలో పాల్గొనవద్దని ప్రకటించింది.

వాగు దాటితేనే వైద్యం

- అర్ధరాత్రి అస్వస్థతకు గురైన చిన్నారి
- ప్రాణాలకు తెగించి వరదదాటి ఆస్పత్రికి తీసుకెళ్లిన తల్లిదండ్రులు
- వంతెన నిర్మించాలని గ్రామస్తుల వేడుకోలు



అర్ధరాత్రి చిన్నారితో వాగు దాటుతున్న దంపతులు

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే వాగులు, ఒర్రెలపై వంతెనలు లేకపోవడంతో ఆదివాసీలకు రాకపోకలు కష్టంగా మారుతున్నాయి. అనారోగ్య సమస్యలు తలెత్తిన అత్యవసర సమయాల్లో ప్రాణాలు పణంగా పెట్టి వరద దాటితేనే వైద్యం అందుతోంది. ఇంద్రవెల్లి మండలం మండలంలోని మామిడిగూడ(బి), మామిడిగూడ(జి) గ్రామాల మధ్య ఉన్న వాగుపై వంతెన లేదు. మామిడిగూడ(బి) గ్రామానికి చెందిన ఉయిక స్వప్న, గోవింగ్ రావ్ దంపతుల కుమార్తె సోమవారం రాత్రి కడుపు నొప్పితో బాధపడింది. కుటుంబ సభ్యులు రాత్రి పూట చిమ్మచీకటిలోనే ఓ చిన్నలైటు, గ్రామస్తుల సాయంతో వాగు దాటారు. ఆటో సాయంతో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి చిన్నారికి చికిత్స అందించారు. తమ గ్రామానికి పక్కా రోడ్డు, వాగుపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు ప్రారంభం కాలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో నాలుగు నెలలపాటు ప్రాణాలకు తెగించి వరద నీటితో సాహసం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా వంతెన, రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

వాగు దాటి.. వైద్యం అందించి..



వాగు దాటుతున్న వైద్య సిబ్బంది

ఇంద్రవెల్లి: మండలంలోని వడగామ్ గ్రామ పంచాయతీ పరిధిలోని జెండాగూడకు వెళ్లాలంటే మధ్యలో ఉన్న వాగు దాటాల్సిందే. మంగళవారం ఏఎన్‌ఎంలు విజయసుందరి, దివ్య, వైద్య సిబ్బంది వాగు దాటి జెండాగూడకు వెళ్లి రోగులు, బాలింతలు, గర్భిణులకు వైద్యం అందించారు. ఇంటింటా తిరిగి ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. వర్షాకాలంలో ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని అవగాహన కల్పించారు.

ఖజానా చెరువును ఈదేశాడు..

- నిర్మల్ వైద్యుడి ఘనత
- భారతదేశ చిత్రపటం ఆకృతిలో స్విమ్మింగ్
- ఐరన్‌మ్యాన్ చాలెంజ్-2025కు సన్నద్ధం



ఈదుతున్న వైద్యుడు బీఎల్ నర్సింహారెడ్డి

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన న్యూరో ఫిజీషియన్ డాక్టర్ బి.లక్ష్మీనర్సింహారెడ్డి చారిత్రక ప్రాశస్త్యం ఉన్న గొలుసుకట్టు చెరువుల్లోని ఖజానా చెరువులో సుమారు 40 నిమిషాల్లో కిలోమీటర్ దూరం మేర ఈత ద్వారా ఆరోగ్య ప్రాధాన్యత, ప్రత్యేకతను చాటారు. రన్నింగ్, సైక్లింగ్, స్విమ్మింగ్ వంటి వాటిల్లో ఆయన ప్రత్యేక నైపుణ్యం సాధించారు. ప్రతీరోజు ఈత అభిరుచిగా మారింది. నిర్మల్ జిల్లా కేంద్రంలో అలనాటి నిమ్మ నాయుడు కాలం నుంచి గొలుసు కట్టు చెరువుల్లో చారిత్రక ఖజానా చెరువుకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. వెంకటాద్రిపేట్ సమీపంలోని ఈ చెరువులో మంగళవారం ఈత కార్యక్రమాన్ని చేపట్టిన ఆయన సరిగ్గా 41 నిమిషాల్లో 919 మీటర్ల మేర దూరాన్ని అవలీలగా ఈదారు. జియోట్యాగింగ్ ద్వారా ఆయన స్విమ్మింగ్ చేసిన మార్గం అచ్చు భారతదేశ చిత్రపటం ఆకృతిని పోలి ఉండడం గమనార్హం. గోవాలో వచ్చే నవంబర్ 9న అరేబియా సముద్రంలో నిర్వహించే ఐరన్ మ్యాన్ స్విమ్మింగ్ చాలెంజ్-2025లో విజయమే లక్ష్యంగా సాధన చేస్తున్నారు. గత సంవత్సరం అక్టోబర్‌లో నెదర్లాండ్స్ దేశంలోని ఆమ్‌స్టర్‌డమ్‌లో నిర్వహించిన మారథాన్ రన్‌లోనూ 34.8 కిలోమీటర్ల దూరం పరుగెత్తి పురస్కారం అందుకున్నారు. సైక్లింగ్‌లోనూ అభిరుచి కలిగిన ఆయన నిర్మల్ నుంచి మహారాష్ట్ర సరిహద్దు పాలజ్ గణేశ్ ఆలయానికి దాదాపు 75కిలోమీటర్ల దూరం, నిర్మల్ నుంచి ఆదిలాబాద్ జిల్లా జైనథ్ సూర్య దేవాలయం వరకు దాదాపు 200 కిలోమీటర్ల పైగా లక్ష్యాన్ని చేరుకున్నారు. ఒక వైద్యుడిగా రోగులకు సేవలందించే ప్రయత్నంలో ఆరోగ్యంపై పలు విధాలుగా చైతన్యవంతం చేస్తాం. ఇందులో భాగంగానే ఫిట్నెస్ అవగాహన కోసం స్వీయంగా ఆచరిస్తూ ఇతరులకు చెప్తే బాగుంటుందని ఉద్దేశంతోనే ఇవన్నీ చేస్తున్నాను...' అని లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు.

పూసాయివాసికి డాక్టరేట్



పట్టా అందుకుంటున్న సిల్వర్ దేవన్న

సాత్నాల: భోరజ్ మండలంలోని పూసాయికి చెందిన సిల్వర్ దేవన్న మంగళవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్ర విభాగంలో సోషల్ ఎకానమీ అండ్ హెల్త్ డెవలప్‌మెంట్ ఆఫ్ ప్రైమెటివ్ ట్రైబ్స్ ఎస్టడీ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై పరిశోధన చేసినందుకుగానూ ఆయన డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ప్రస్తుతం దేవన్న ఉట్నూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకుడిగా సేవలందిస్తున్నారు.

నిజాయతీ చాటుకున్న విజయ్



ఎస్పీకి నగదు అప్పగిస్తున్న విజయ్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్‌కు చెందిన విజయ్‌కుమార్ తనకు దొరికిన రూ.2.48 లక్షల నగదును పోలీసులకు అప్పగించి నిజాయతీ చాటుకున్నాడు. మంగళవారం బస్టాండ్ నుంచి ఇంటికి వెళ్తుండగా స్థానిక కోర్టువద్ద ఓ బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అనుకోకుండా నగదును కింద పడేసుకున్నాడు. గమనించిన విజయ్ పోలీసులను సంప్రదించి నగదు అప్పగించాడు. ఈ సందర్భంగా ఎస్పీ జానకీ షర్మిల విజయ్‌ను అభినందించారు.

రెండోరోజు కొనసాగిన కౌన్సెలింగ్



అడ్మిషన్ పత్రం అందిస్తున్న వీసీ గోవర్ధన్

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో మంగళవారం రెండోరోజు కౌన్సెలింగ్ కొనసాగింది. క్రమసంఖ్య 565 నుంచి 1128 వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రెండు రోజుల్లో 1,128 మందికి గానూ 989 మంది విద్యార్థులు హాజరయ్యారు. 139 మంది విద్యార్థులు రెండు రోజుల్లో కౌన్సెలింగ్‌కు హాజరు కాలేకపోయారు. గైర్హాజరైన విద్యార్థుల స్థానాలను త్వరలో వెకెంట్ లిస్టు ఆధారంగా భర్తీ చేస్తామని వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారం కూడా కొనసాగనుంది.

మద్యం విక్రేతపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శ్రీరామ్ కాలనీలో గల ఓ హోటల్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న లంకాడే సత్యనారాయణపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. వైన్స్‌షాపు నుంచి మద్యం తీసుకొచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానికుల సమాచారం మేరకు తనిఖీ చేయగా పది మద్యం బాటిళ్లు లభించినట్లు వివరించారు.

ముగ్గురి రిమాండ్

సాత్నాల: భోరజ్ మండలంలోని పెండల్వాడలో భవునే రవి ఇంట్లో దేశీదారు విక్రయిస్తున్నారని సమాచారంతో మే 12న తనిఖీకి వెళ్లిన ఎక్సైజ్ ఎస్సై వైద్య వెంకటేశ్వర్, ఆరుగురు సిబ్బందిపై బావునే నమిత, బావునే మనీషా, బావునే సుమన్ భాయ్ దాడికి పాల్పడ్డారు. ఎక్సైజ్ ఎస్సై వైద్య వెంకటేశ్వర్ ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గౌతమ్ పవర్ తెలిపారు.

వ్యాపారి ఇంటి ఎదుట రైతుల ధర్నా



ధర్నా చేస్తున్న బాధిత రైతులు

లక్సెట్టిపేట: రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసిన వ్యాపారి డబ్బులు చెల్లించకుండా ఐపీ పెట్టడంతో బాధితులు మంగళవారం బీట్ బజార్‌లోని వ్యాపారి ఇంటిఎదుట ధర్నా నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి. సదరు వ్యాపారి రైస్‌మిల్లు నిర్వహిస్తూ దండేపల్లి, లక్సెట్టిపేట మండలాల్లోని రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా కొందరి వద్ద డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. సుమారు రూ.7 కోట్లు అప్పులు కావడంతో రంగారెడ్డి జిల్లా కోర్టు నుంచి ఐపీ తీసుకుని బాధితులకు పంపించాడు. కోర్టు నోటీసు తీసుకున్న బాధితులు వ్యా పారి ఇంటి ఎదుట ధర్నాకు వచ్చి ఇట్టి ఇల్లు రైతులకు చెందినదని బోర్డు రాసి పెట్టారు. సుమారు 195 మంది బాధితులు నిరసన వ్యక్తం చేశారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని బాధితులను పంపించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య



రాంచందర్ (ఫైల్)

భీమారం: ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్వేత, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని కాజిపల్లికి చెందిన జాగేటి రాంచందర్ (51) కూలీ పనులు చేస్తూనే గతేడాది కొంతమేర భూమి కౌలుకు తీసుకుని అప్పుచేసి పత్తి సాగు చేశాడు. దిగుబడి రాక అప్పులు పెరగడంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం రాత్రి గడ్డిమందు తాగి భార్య భారతితో చెప్పాడు. వెంటనే మంచిర్యాల ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దొంగలను గుర్తిస్తే సమాచారం ఇవ్వండి



సీసీ కెమెరాలో రికార్డయిన నిందితుల ఫొటోలు

చెన్నూర్: మండలంలోని సుబ్బారాంపల్లిలో వృద్ధురాలి మెడలోని గొలుసు దొంగిలించిన వారిని గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ దేవేందర్‌రావు తెలిపారు. మంగళవారం సీసీ ఫుటేజీ చిత్రాలను విడుదల చేశారు. గుర్తిస్తే 8712656553 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయింపు

చెన్నూర్: చెన్నూర్‌కు చెందిన బట్టల వ్యాపారి కుడికాల మధు పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని ఆరోపిస్తూ పట్టణంలోని కుమ్మరిబొగుడ కాలనీకి చెందిన బొడమిది సౌమ్య మంగళవారం ప్రియుని ఇంటి ఎదుట బైఠాయించింది. పదేళ్ల క్రితం తనను ప్రేమించి తల్లిదండ్రుల ఒత్తిడి మేరకు వేరే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడని పేర్కొంది. మూడేళ్ల క్రితం మళ్లీ తన వెంటపడి పెళ్లి చేసుకున్నాడని, అబార్షన్‌కూడా చేయించాడని పేర్కొంది. ఇంటికి తీసుకెళ్తానని చెప్పి కాలయాపన చేస్తున్నాడని వాపోయింది. అధికారులు స్పందించి న్యాయం చేయాలని వేడుకుంటోంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి ఫిర్యాదు చేస్తే విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సౌమ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దేవేందర్‌రావు తెలిపారు.

పోచంపల్లిలో మరో యువతి..

తాండూర్: ప్రేమించిన యువకుడు పెళ్లికి నిరాకరించడంతో ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు న్యాయపోరాటానికి దిగిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. తాండూర్ మండలం పోచంపల్లికి చెందిన బోరేం శ్వేత, సమీప బంధువైన గొర్లపల్లి కళ్యాణ్ తొమ్మిదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకోవాలని కోరగా సమాధానం చెప్పకుండా దాటవేత ధోరణి ప్రదర్శించాడు. పెళ్లి చేసుకోవాల్సిందేనని గట్టిగా పట్టుబట్టడంతో చేసుకోనని చెప్పేశాడు. దీంతో సదరు యువతి మంగళవారం ప్రియుడి ఇంటి ఎదుట న్యాయ పోరాటానికి దిగింది. మాదారం ఎస్సై సౌజన్య యువకుడిని పిలిపించి మాట్లాడతానని నచ్చజెప్పడంతో తాత్కాలికంగా తన న్యాయ పోరాటాన్ని విరమించింది. కాగా ఈ ఘటన మండలంలో చర్చనీయాంశమైంది.

గవర్నర్‌ను కలిసిన మాజీ ఎంపీ 'సోయం'



గవర్నర్‌కు వినతిపత్రం ఇస్తున్న బాపూరావు

కైలాస్‌నగర్/ఆసిఫాబాద్ : కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో టైగర్ కన్జర్వేషన్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 49 రద్దు చేయాలని కోరుతూ మాజీ ఎంపీ సోయం బాపూరావు మంగళవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి గవర్నర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 49 ఆదివాసీ హక్కులను కాలరాసేలా ఉందని, వెంటనే రద్దుచేసి ఆ ప్రాంతంలో నివసించే గిరిజన, గిరిజనేతరులకు స్వేచ్ఛ కల్పించాలని కోరారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్లను ఏకపక్షంగా టైగర్ కన్జర్వేషన్‌లో కలపడంతో అడవులు, అటవీ భూములను నమ్ముకుని బతికే గిరిజనుల హక్కులకు భంగం వాటిల్లుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోడు భూముల సమస్యలను సానుకూలంగా పరిష్కరించేందుకు ముందుకు వస్తున్న క్రమంలో జీవో జారీ చేయడం సరికాదన్నారు. ఈ జీవో కారణంగా 339 ప్రభావిత గ్రామాల్లో ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. ఆదివాసీ గిరిజనులకు న్యాయం చేస్తానని గవర్నర్ హామీ ఇచ్చినట్లుగా పేర్కొన్నారు. కార్యక్రమంలో అఖిల భారతీయ గోండ్వానా మహాసభ ఉపాధ్యక్షుడు సిడాం అర్జు, జిల్లా మేడి కుర్సంగే మోతిరాం, రాజ్‌గోండ్ రాష్ట్ర కార్యదర్శి పెందూర్ సుధాకర్, రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా కార్యదర్శి నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

సబ్సిడీ ఎరువులు తరలిస్తున్న ఐదుగురిపై కేసు



సీజ్ చేసిన వాహనాలతో డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందిస్తున్న ఎరువులను అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. రైతులు ఇచ్చిన సమాచారం మేరకు దాడి చేసి రెండు వాహనాలను జైనథ్ పోలీసులు మంగళవారం పట్టుకున్నట్లు పేర్కొన్నారు. బేల మండలం మార్క్‌ఫెడ్ అనుబంధ సంస్థ హైదరాబాద్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ అసోసియేషన్ (హాకా) ప్రొప్రైటర్ సునీల్, ఉద్యోగి అజయ్ మహారాష్ట్రకు చెందిన ఫర్టిలైజర్ దుకాణ యజమాని నిఖిల్‌తో ఒప్పందం కుదుర్చుకుని రూ.3 లక్షలు విలువ చేసే 150 బ్యాగుల యూరియాను రెండు వాహనాల్లో తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వాహన డ్రైవర్లు వంకాడే దిలీప్, చిలకలవార్ చంద్రశేఖర్‌తో పాటు సునీల్, అజయ్, నిఖిల్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో జైనథ్ సీఐ డి.సాయినాథ్, బేల ఎస్సై నాగ్‌నాథ్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న తుడుందెబ్బ నాయకులు

ఇంద్రవెల్లి: ఈ నెల 9న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేశ్ కోరారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను కుదించి తీసుకువచ్చిన నాలుగు కోడ్‌లు, కార్మికుల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయన్నారు. సమావేశంలో తొడసం నాగోరావ్, కుమ్ర చంద్రకళ, రఘురాం, అమృత్‌రావ్, మానిక్‌రావ్, గేడం భరత్, జుగ్నాక్ భరత్, తదితరులు పాల్గొన్నారు.

కోడలును వేధించిన మామకు ఏడేళ్ల జైలు

ఆసిఫాబాద్: లైంగికంగా కోడలును వేధించిన మామకు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.30వేలు జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎంవీ.రమేశ్ మంగళవారం తీర్పునిచ్చారు. ఈ మేరకు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ వివరాలు వెల్లడించారు. సిర్పూర్(టి) మండలం చీలపెల్లి గ్రామానికి చెందిన మోర్లె లక్ష్మణ్‌కు 2015లో హత్య కేసులో కోర్టు 14ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఆరేళ్ల జైలు జీవితం అనంతరం బెయిల్‌పై వచ్చాడు. లక్ష్మణ్ భార్య గతంలో చనిపోగా రెండో వివాహం చేసుకున్నాడు. రెండో భార్య కూడా చనిపోయింది. ఈ క్రమంలో కోడలిని అసభ్య పదజాలంతో దూషిస్తూ లైంగిక వాంఛ తీర్చాలని అసభ్యకరంగా ప్రవర్తించాడు. గత ఏడాది అక్టోబర్ 7న బాధితురాలి ఫిర్యాదు మేరకు సిర్పూర్(టి)లో కేసు నమోదైంది. ఎస్సై కమలాకర్ కేసు దర్యాప్తు చేశారు. పీపీ జగన్మోహన్‌రావు, సీడీవో అండ్ లైజనింగ్ ఆఫీసర్ రాంసింగ్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, కౌటాల సీఐ రమేశ్, ఎస్సై కమలాకర్, సీడీవో బాలాజీని ఎస్పీ అభినందించారు.

పులి దాడిలో లేగదూడ హతం



లేగదూడను పరిశీలిస్తున్న అధికారులు

కాసిపేట: మండలంలోని వెంకటాపూర్ శివారు అటవీప్రాంతంలో పెద్దపులి దాడిలో లేగ దూడ మృతి చెందింది. బెల్లంపల్లి అటవి రేంజ్ అధికారి పూర్ణచందర్ తెలిపిన వివరాల ప్రకారం. మంగళవారం మండలంలోని వెంకటపూర్‌కు చెందిన రైతు బుద్దె రాజలింగు తన లేగ దూడ పులి దాడిలో మృతి చెందిందని అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. సమీపంలో కుంట వద్ద పెద్దపులి అడుగులు ఉన్నట్లు గుర్తించారు. పెద్దపులి సంచరిస్తున్నందువల్ల వెంకటాపూర్, లక్ష్మీపూర్, మల్కేపల్లి, సోనాపూర్ గ్రామాల ప్రజలు పంట పొలాల్లోకి వెళ్లేటప్పుడు గుంపులుగా వెళ్లాలని సూచించారు. పశువుల కాపారులు అడవిలోకి వెళ్లవద్దన్నారు. బాధిత రైతుకు నష్టపరిహారం అందించేందుకు ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడి గల్లంతు

తాంసి: మండలంలోని మత్తడివాగు ప్రాజెక్టులో చేపలు పట్టడానికి వెళ్లి యువకుడు గల్లంతైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆదిలాబాద్‌కు చెందిన అడెల్ల రఘు తన మిత్రుడు శ్రావణ్‌తో కలిసి చేపలు పట్టడానికి ప్రాజెక్టు వద్దకు వచ్చాడు. ప్రాజెక్టు దిగువ భాగంలో చేపలు పడుతుండగా లోతు ఎక్కువగా ఉండడంతో ఈతరాక నీటిలో గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి జాలర్లతో గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై ప్రణయ్ కుమార్ తెలిపారు.